# నువ్వు నాకు నచ్చావ్

-వాణిశ్రీ

"తులసెమొద్దినా! సునంద పెళ్లెప్పుడు చేస్తున్నారు?" అడిగింది దమయంతి. ఇప్పట్లో సునంద పెళ్లి జరగదని దమయంతికి తెలుసు. అయినా అడిగి తులసమ్మను బాధ పెట్టడం, తను సంతోషించడం దమయంతి నైజం.

"ఏమో వదినా! దాని పెళ్లెప్పుడు జరుగుతుందో అంతుబట్టడం లేదు. సంబంధాలు వస్తున్నాయి, పోతున్నాయి. ఏదీ కుదరడం లేదు. ఎక్కడ రాసి పెట్టి వుందో?" అని వాపోయింది తులసమ్మ.

"అంతే వదినా! దేనికైనా టైమ్ రావాలి. కళ్యాణం వచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు. వచ్చినప్పుడు అవుతుంది" అని కాసేపు కబుర్లు చెప్పి వెళ్లిపోయింది దమయంతి.

తులసమ్మకు కూతురు పెళ్లి ఎప్పుడు అవుతుందో అని దిగులు పట్టుకుంది. సునంద ఎమ్మెస్సీ పాసైంది. ఒక ప్రైవేటు జూనియర్ కాలేజీలో లెక్చరర్గా జాబ్ చేస్తోంది. కానీ ఎవరికీ ఆమె నచ్చడంలేదు. ఆఫర్ చేసే కట్నం ఎవరికీ ఆనడంలేదు.

"బోడి లక్ష రూపాయలిస్తారట. రిక్షా తొక్కుకునేవాడికి ఇస్తున్నారు లక్ష" అని ఈసడిస్తున్నారు.

సునంద నలుపుకాదు. చామనఛాయ. ఎత్తుగానే వుంటుంది. పెద్ద అందగత్తెకాదు. కానీ ఆకర్షణీయంగానే వుంటుంది. పాతికేళ్లు దాటిపోతున్నాయి.

అదీ తులసమ్మ దిగులు. ఏ తల్లికైనా కూతురికి వయసు మీరిపోతుంటే పెళ్లి కాలేదనే దిగులు వుంటుంది.

అది సహజమే. ఇప్పుడు మరీ డబ్బు యుగం నడుస్తోంది. అంతా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అక్కడ లక్షల జీతం. ఐనా వాళ్లకి డబ్బు మీద తీరని దాహం.

"ఎన్ని లక్షలిస్తారు కట్నం?" అని అడుగుతారు.

పాతిక లక్షలు, యాభై లక్షలు ఇచ్చే వాళ్లున్నారు. కోట్లు ఇస్తున్నారు ఉన్నవాళ్లు. మరీలేని వాళ్లేం ఇస్తారు?

అమెరికా వాళ్లేంటి? ఇండియాలో ఉన్న మామూలు ఉద్యోగులు కూడా 'పదిలక్షలిస్తావా?, సిటీలో ఫ్లాట్ కొనిస్తారా?' అని అడుగుతారు.

పెళ్లి కేవలం ఆడపిల్లకే, మగాడికి అవసరం లేదన్నట్లు మాట్లాడతారు. ఇందులో పెత్తనమంతా ఆడవాళ్లదే.

మగవాళ్లని నోరు మెదపనివ్వరు.స్త్రీకి శత్రువు స్త్రీయే అనేది ఎంతైనా నిజం.

తులసమ్మ ఆలోచనలు అంతులేకుండా సాగుతున్నాయి.

★★★

రామ్‌ప్రసాద్ అమెరికా నుంచి వచ్చాడు. అతని తల్లి హనుమాయమ్మ. ఇండియా వచ్చి పెళ్లి చేసుకుని వెళ్లరా అని ఒకటే గొడవ. ఫోన్‌లో అరగంటసేపు పెళ్లి గురించి మాట్లాడుతుంది.

ఆమె భయం ఆమెది. ఈమధ్య వాళ్ల వీధిలోనే వున్న సత్యనారాయణరావు కొడుకు రష్యాలో చదివాడు.

వస్తూ వస్తూ రష్యన్ అమ్మాయిని పెళ్లి చేసుకుని తీసుకువచ్చాడు. ఆ పిల్లకు తెలుగురాదు, అత్తకి ఇంగ్లీషు రాదు. ఆ పిల్ల ప్యాంట్, షర్ట్ టక్ చేసుకుని తిరుగుతుంటే అత్త అల్లాడిపోయేది. ఆ మాదిరిగానే తన కొడుకు కూడా ఏ ఇంగ్లీషు అమ్మాయినో పెళ్లి చేసుకుంటే? అనే భయం ఆమెను వెన్నాడుతోంది. అందుకే పెళ్లి..పెళ్లి అంటూ వెంటపడింది.

రామ్‌ప్రసాద్ కూడా అక్కడ ఇల్లు కొనుక్కుని సెటిలయ్యాడు. కారు కొన్నాడు, ఇక పెళ్లి చేసుకున్నా ఫర్వాలేదు. ఇబ్బంది లేదని, కేవలం పెళ్లి చేసుకుని వెళ్లడానికని నెలరోజులు సెలవు పెట్టి వచ్చాడు.

ఇప్పుడు హనుమాయమ్మకు చాలా సంతోషంగా ఉంది కొడుకు పెళ్లికి ఒప్పుకుని వచ్చినందుకు.

అమెరికాలో సెటిలైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి సంబంధాలకేం కొదవ? కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి వధువుల ఫోటోలు.

"అమ్మా! తులసమ్మ అత్త కూతురు సునందకు పెళ్లయిందా?" అడిగాడు రామ్‌ప్రసాద్.

"లేదురా ఏం?"

"సునందంటే నాకిష్టం"

హనుమాయమ్మ ఆశ్చర్యపోయింది. తులసమ్మ దూరపు బంధువు. ఆస్తిపాస్తులు పెద్దగా లేవు. పిల్ల కూడా పెద్ద అందగత్తెకాదు. చాయన ఛాయతో కొంగలా వుంటుంది.

అయినా వీడు సునందతో సన్నిహితంగా వుండే అవకాశం లేనేలేదు. మరి ఆ పిల్ల వీడికి నచ్చడం ఏమిటి?


"అదేంట్రా... ఆ పిల్ల ఏమంత అందగత్తె అని? చూడు ఈ ఫోటోల్లోని అమ్మాయిలు అప్సరసల్లా ఎలా మెరిసిపోతున్నారో? ఇంతమందిలో నీకు ఏ పిల్లా నచ్చలేదా? అయినా వాళ్లు ఏమంత ఆస్తులున్నవాళ్లు? ఉండడానికేదో ఒక్క పెంకుటిల్లు ఉంది. వాళ్ల నాన్న గుమాస్తా" అన్నది హనుమాయమ్మ.

"అందం, ఐశ్వర్యమే చాలదమ్మా. ఐతే నువ్వు సునందను పూర్తిగా మర్చిపోయావన్నమాట'' అన్నాడు రామ్‌ప్రసాద్ నవ్వుతూ.

"ఏమిట్రా నువ్వనేది? నేను సునందను ఎక్కడ మర్చిపోయాను? సంగతులు తెలుస్తూనే వున్నాయి. సునంద ఎమ్మెస్సీ చదివింది. లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోంది'' అంది.

"అది కాదమ్మా. ఒకసారి సునంద మన ఇంటికి వచ్చింది. అప్పుడేం జరిగిందో గుర్తు లేదన్నమాట'' తల్లికి గుర్తు చేసాడు రామ్‌ప్రసాద్.

హనుమాయమ్మకు అదంతా కళ్లముందు మెదిలింది.



ఆమెకు సంతోషం కలిగింది.

"అయితే అప్పుడెప్పుడో జరిగినదంతా గుర్తుందన్నమాట' అంది నవ్వుతూ.

"మర్చిపోయే సంగతా అది?" అన్నాడు.

"మరి మనం సునందను పెళ్లిచూపులు చూడడానికి వెళ్దామా?" అడిగింది.

"సునందను ఇప్పుడు కొత్తగా చూసేది ఏంటమ్మా నువ్వు మరీనూ." అన్నాడు.

"ఏదో సాంప్రదాయం అంటారుగా?"

"అదంతా తెలియని వాళ్ల విషయంలో"

"సునందను చూసి చాలాకాలమైందిరా. ఇప్పుడెలా వుందో చూడవూ'

"అదంతా వద్దమ్మా. టైమ్ వేస్ట్. తులసమ్మ అత్తకి ఫోన్ చేసి మాట్లాడు.

## మారియానా కూపము

పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మారియానా కూపము ఎంత లోతయినదంటే ఏదైనా వస్తువుని దాంట్లోకి విసిరితే ఆ వస్తువు అట్టడుగుకి




చేరడానికి ఒక గంట పడుతుందిట.

## కప్పల వాన

ఒకసారి ఫ్రాన్స్‌లో విపరీతమైన గాలివాన వచ్చినప్పుడు లక్షకుపైగా చిరుకప్పలు ఆకాశం నుంచి వర్షంలా కురిసాయిట.

తటవర్తి




నాన్న ఫ్రెండ్ నందంగారని పురోహితుడు ఉన్నాడు చూడు. ఆయనతో మాట్లాడి ముహూర్తం పెట్టిస్తే సరిపోతుందిగదా" అన్నాడు.

"పోనీ ఎంగేజ్‌మెంట్‌కి అయినా వస్తావా? డైరెక్టుగా పెళ్లిపీటలమీద కూర్చుంటావా?"

"మళ్లీ ఎంగేజ్‌మెంట్ తంతు దేనికమ్మా? పెద్దవాళ్లు తాంబూలాలు మార్చుకుంటే సరిపోతుంది."

"దాన్నే ఎంగేజ్‌మెంట్ అంటార్లేరా?" అంది హనుమాయమ్మ.

***

రామ్‌ప్రసాద్ పెళ్లి సునందతో జరగడం బంధుమిత్రులందరికీ ఆశ్చర్యం కలిగించింది.

అతను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పాతికలక్షలు కట్నం ఇచ్చి అందాలబొమ్మల్లాంటి అమ్మాయిలనిచ్చి పెళ్లి చేయడానికి ఎందరో క్యూలో ఉన్నారు. అందర్నీకాదని సునందను పెళ్లి చేసుకోవడం ఏమిటి? అంతా విచిత్రంగా ఉంది. పోనీ కట్నానికి ఆశపడి చేసుకున్నాడా అంటే అదీ లేదు.

ఈ సందేహం అందరితోపాటు సునందకీ ఉంది. నిశ్చయ తాంబూలాలు తీసుకునేటప్పుడు రామ్‌ప్రసాద్‌ని అడగాలనుకుంది. కానీ ఏదో పొడి పొడి మాటలు మాట్లాడగలిగింది.

క్లాస్‌లో ధారాళంగా లెక్చర్ దంచే ఆమె అతని ముందు మూగది అయింది. తల్లిని అడిగింది.

"అమ్మా! హనుమాయమ్మ అత్తయ్య కొడుకు నన్నే పెళ్లి చేసుకుంటానని పట్టుపట్టాడెందుకు?"

తులశమ్మ ఉబ్బితబ్బిబ్బవుతోంది. ఇన్నేళ్ల నుంచీ పడుతున్న దిగులుకి విముక్తి లభించి గాలిలో తేలిపోతోంది. అమెరికాలో ఉంటున్నవాడు అల్లుడు కాబోతుండడంతో ఆమెకు ఆనందంతోపాటు గర్వంగా కూడా ఉంది.

"అంతా నీ అదృష్టమే తల్లీ. ఏ జన్మలోనో నువ్వు బంగారుపూలతో దేవుడికి పూజ చేసి వుంటావు. అందుకే బంగారంలాంటి మొగుడు విమానం మీద ఎగిరి అమెరికా నుంచి వచ్చాడు. నీకు నా దిష్టే తగిలేట్టు వుంది. ఇక ఇరుగుపొరుగుల దిష్టి తగులుతుందో ఏమో" అని ఉప్పుగళ్లతో దిష్టి తీసి నీళ్లతొట్టిలో వేసింది.

సునందకి తల్లి చెప్పింది నిజం కాదనిపిస్తోంది. అదృష్టం సంగతి పక్కన పెడితే తను అతనికి అంతగా నచ్చడానికి ఏదో బలమైన కారణం ఉందని అనిపిస్తోంది.

అతన్నే అడిగి సందేహ నివృత్తి చేసుకోవాలని నిశ్చయించుకుంది. ఆ రోజు రానే వచ్చింది.

***

శోభనం రాత్రి తెల్లటి చీర కట్టుకుని తలనిండా మల్లెలు పెట్టుకుని పాల గ్లాసుతో గదిలోకి అడుగుపెట్టింది.

"రా సునందా!" అని అతను ఎదురొచ్చి ఆమె భుజంమీద చేతులు వేసి నడిపించుకుని వెళ్లాడు.

మంచంమీద తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. అతినికి పాల గ్లాసు అందించింది.

అతను పాలన్నీ తాగేసి ఖాళీ గ్లాసు కింద పెట్టేసాడు. ఆమె అతనివైపు కళ్లెత్తి ఆశ్చర్యంగా చూసింది.

శోభనం పెళ్లికొడుకు గ్లాసులో సగం పాలు తాగి భార్యకు అందివ్వడం చాలా సినిమాల్లో చూసింది.

"ఏమిటి అలా చూస్తున్నావు? సగం పాలు తాగి గ్లాసు నీకు ఇవ్వలేదనా? నో ఫార్మాలిటీస్" అని నవ్వాడు.

సునంద కూడా నవ్వింది.

"ఏమిటీ మీ కాలేజీ కబుర్లు? నువ్వు నాతోపాటు అమెరికా వచ్చేస్తే మీ స్టూడెంట్స్‌కి డిస్ట్రబెన్స్ ఏమో? ఎగ్జామ్స్ అయ్యేవరకు జాబ్ చేయి" అన్నాడు.

ఆమె తల వూపింది. ఆమె తన కాలేజీ కబుర్లు చెప్తే అతను అమెరికాలో ఇండియన్స్ జీవనశైలి గురించి వర్ణించాడు.

"మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. నిజం చెప్పాలి" అంది సునంద.

"అడుగు. నాకు పెద్దగా అబద్ధాలు చెప్పే అలవాటు లేదు" అన్నాడు నవ్వుతూ.

"పెద్దగా లేదంటే కొంచెం కొంచెం ఉందన్నమాట"

"అవును. అప్పుడప్పుడు ఆపద్ధర్మంగా అబద్ధాలు ఆడాల్సి వస్తుందిలే. ఆడవాళ్లతో అబద్దాలాడకపోతే గడవదు మరి. అయినా కొత్త పెళ్లాంతో అబద్ధాలు ఆడనులే" అన్నాడు సరదాగా.

"నేను కొత్త పెళ్లాన్నయితే మీకు పాత పెళ్లాం ఉందా?" క్రీగంట చూస్తూ అడిగింది.

"అదా నీ సందేహం? అమెరికాలో ఆల్రెడీ ఒక తెల్లమ్మాయితో కాపురం పెట్టేసి ఇండియా వచ్చేసి కులమింటి కోతిని కట్టుకున్నాననా?"

"ఏంటీ నేను కోతినా?"

"సారీనోయ్. నీకు కొంగ అనే ముద్దు పేరు ఉందిటగా?"

"పొట్టిగా ఉండేవాళ్లు నేను కొంచెం పొడుగ్గా ఉన్నానని ఈర్ష్యతో అనే మాటలు"

"ఓహో... నువ్వంటే జెలసీతో ఏడ్చేవాళ్లు పెట్టిన ముద్దు పేరన్నమాట"

సునంద తల ఊపి "నా సందేహం తీర్చుతారా?"

"నువ్వు అడగందే"

"మీరు నన్నే ఏరికోరి ఎందుకు పెళ్లి చేసుకున్నారు? మీకెన్నో సంబంధాలు వచ్చాయిట కదా. అందమైన అమ్మాయిలు కట్నకానుకలతో మిమ్మల్ని వరించడానికి సిద్ధంగా ఉంటే నన్నే చేసుకుంటానని పట్టు పట్టారటగా?" తల వంచుకుని సిగ్గుపడుతూ అడిగింది సునంద.

"నువ్వు నాకు నచ్చావ్" అన్నాడు తేలిగ్గా.

"మీరు నన్నెప్పుడు చూసారు? ఎప్పుడో చిన్నప్పుడు చూసారేమో? తర్వాత ఎప్పుడూ కలుసుకునేలేదుకదా" అంది.

"మనిషి అందంగా ఉండడం అంటే బాహ్య సౌందర్యాన్ని చూసి అంచనా వేయకూడదు. ధనం ఉన్నంత మాత్రాన సంస్కారం కూడా వుంటుందని నమ్మడం కూడా తప్పే. నువ్వు నాకు ఎందుకు నచ్చావ్? అనేది నీకే కాదు చాలామందికి మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎందుకంటే మనం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లాలి.

నువ్వప్పుడు ఇంటర్ చదువుతున్నావు. సెకండ్ ఇయర్‌లో నువ్వొక సబ్జెక్ట్‌లో తప్పావు. ఇన్‌స్టెంట్ ఎగ్జామ్‌లో పాసైతే సంవత్సరం వృధా కాదు. ఆ ఎగ్జామ్ సెంటర్ మీ ఊళ్లోలేదు. మీ నాన్న దూరపు బంధుత్వాన్ని పురస్కరించుకుని నిన్ను మా ఇంటికి తీసుకువచ్చాడు. మళ్లీ ఎగ్జామ్స్ అయిపోయాక వస్తానని వెళ్లిపోయాడు. ఇంట్లో ఆ రాత్రి మా అమ్మ, నువ్వు మాత్రమే ఉన్నారు. మా నాన్న కేంప్‌లో ఉన్నాడు. నాకు ఫైనల్ సెమిస్టర్. హాస్టల్లో ఉన్నాను. తెల్లవారింది. నువ్వు తొమ్మిదికల్లా ఎగ్జామ్ హాలుకి వెళ్లాలి. టిఫిన్ తిని వెళ్లమని అమ్మ అంటే నువ్వు సరేనని తయారయ్యావు. ఈలోపల అమ్మ కిచెన్‌లో పడిపోయింది. హార్ట్ ఎటాక్ వచ్చింది. నువ్వు వెంటనే ఆటో పిల్చుకొచ్చి అమ్మను హాస్పిటల్‌కు తీసుకెళ్లావు. అమ్మ బతికింది. ఆ తరువాత మేమంతా వచ్చాం. నేను అక్కడ ఉండగానే అమ్మ "నీకు ఎగ్జామ్ తప్పిపోయింది. సంవత్సరం చదువు వృధా అయింది సునందా" అని బాధపడింది. అందుకు నువ్వు "ఇందులో వృధా ఏముంది అత్తయ్యా. ఎగ్జామ్ మళ్లీ రాయవచ్చు. నీ ప్రాణం కంటే ఎక్కువా?" అని అన్నావు. నీలో వున్న కరుణామయ హృదయం చూసి నా కళ్లు చెమ్మగిల్లాయి. అప్పుడే నువ్వు నాకు నచ్చావ్" చెప్పడం ముగించాడు రామ్‌ప్రసాద్.

సునంద నీళ్లు నిండిన కళ్లు తుడుచుకుని అతన్ని గాఢంగా కౌగలించుకుంది.

★



## శిల్ప క్షమాపణలు!

ఇటీవల ఓ చిత్రానికిగాను శిల్పాశెట్టి- సుధాంషు పాండె అనే నటుడి చెంప చెళ్లుమనిపించాలి. ఎన్ని టేకులు తిన్నా సరిగ్గా చెంప మీద కొట్టలేకపోయిందిట శిల్ప. చివరికి సన్నీ డియోల్ చెప్పిన మీదట సుధాంషు చెంపని పేలగొట్టిందిట. షాట్ సూపర్ అన్నాడు దర్శకుడు. కానీ శిల్పా మాత్రం తెగ వర్రీ అయిపోయి సుధాంషుకి క్షమాపణలు చెప్పుకుందిట. పర్వాలేదని అతను అన్నా కూడా ఆ మర్నాడు బొకే ఇచ్చి అతనింటికి పంపించి తిరిగి క్షమాపణలు కోరిందిట.

